క్లుప్తంగా

సివిల్ సప్లై గోడౌన్ తనిఖీ



గోడౌన్‌లో నిత్యావసర సరుకులు పరిశీలిస్తున్న ఆర్డీవో భరత్‌నాయక్

పత్తికొండ(తుగ్గలి) : స్థానిక సివిల్ సప్లై గోడౌన్‌ను ఆర్డీవో భరత్‌నాయక్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు తనిఖీ చేశారు. నిత్యావసర సరుకుల నిల్వలు, నాణ్యతను పరిశీలించారు. నిల్వల వివరాలను ఇన్‌చార్జ్ రఘురామిరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. సకాలంలో చౌకదుకాణాలకు సరుకులు చేర్చేలా చూడాలని ఆదేశించారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన ఉండాలి



క్యాలెండర్‌ను విడుదల చేస్తున్న తహసీల్దారు సతీష్

హొళగుంద: సమాచార హక్కు చట్టం 2005 పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కమిటీ సభ్యులు విశ్వనాథ్, వెంకటగిరి అన్నారు. సోమవారం సమాచార హక్కు కార్యకర్తల సంఘం 2025 నూతన సంవత్సర క్యాలెండర్‌ను తహసీల్దారు సతీష్, ఎస్‌ఐ బాల నరసింహులు, ఎంపీడీఓ విజయలలిత తదితరులతో కలిసి విడుదల చేశారు. వారు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ద్వారా ప్రభుత్వ శాఖల్లో నిధుల వివరాలు, ఖర్చులు ఇతర విషయాలను తెలుసుకోవచ్చన్నారు. వ్యక్తిగత వివరాలు తప్పా ప్రభుత్వ అధికారుల పనితీరును ప్రశ్నించే హక్కుల ఈ చట్టం ద్వారా లభిస్తుందన్నారు. పెద్దహ్యాట మల్లయ్య, నాగరాజు, మల్లి, వేణు, కృష్ణ పాల్గొన్నారు.

20 నుంచి ఉచిత కంప్యూటర్ శిక్షణ



కంప్యూటర్ శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

ఆలూరు: ఈనెల 20వ తేదీ నుంచి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత కంప్యూటర్ శిక్షణ నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా వృత్తి నైపుణ్యాభివృద్ధి అధికారి ఆనందరాజ్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. 30 సీట్లు మాత్రమే ఉన్న ఈ శిక్షణ కార్యక్రమంలో ఈనెల 20వ తేదీ నుంచి మరో కొత్త బ్యాచ్‌కు శిక్షణ ప్రారంభమవుతుందన్నారు. ఇంటర్, డిగ్రీ, డిప్లొమా పూర్తి చేసిన యువతీ, యువకులు శిక్షణకు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన యువతీ, యువకులు ఈనెల 18వ తేదీన ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఆలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. వివరాలకు సెల్ 9010003132 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

పర్యావరణాన్ని సంరక్షించుకుందాం



స్టీల్ పేట్లను అందిస్తున్న దృశ్యం

వెల్దుర్తి(కృష్ణగిరి): పర్యావరణ సంరక్షణకు ప్రతిఒక్కరూ పాటుపడాలని హెల్పింగ్ హ్యాండ్స్ సేవా సంస్థ అధ్యక్షుడు హరి నరసింహనాయుడు పిలుపునిచ్చారు. సోమవారం జర్నలిస్ట్ అసోసియేషన్, వైద్యం గిడ్డయ్య సాహితీ పురస్కార కమిటీ సభ్యులతో కలిసి పర్యావరణవేత్త వర్మి కంపోస్టు హరికృష్ణకు బట్ట సంచులు, స్టీల్ పేట్లను అందజేశారు. వారు మాట్లాడుతూ 2025 జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు ప్రయాగలో జరిగే మహా కుంభమేళాలో పాల్గొనే వారు వాడే ప్లాస్టిక్ వ్యర్థాలతో పర్యావరణానికి ఎంతో ముప్పు కలుగుతుందన్నారు. దీంతో పర్యావరణాన్ని కాపాడేందుకు బట్ట సంచులు, పేట్లు అందజేశామన్నారు. కర్నూలు జిల్లా నుంచి కుంభమేళాకు పదివేల పేట్లు, సంచులు పంపుతామని చెప్పారు. షేక్ అమీర్‌బాషా, వైద్యం రామానాయుడు, బాంబే బజారు నిర్వహకుడు నాగేష్, మల్లయ్య పాల్గొన్నారు.

వైద్యం గిడ్డయ్య సేవలు ఆదర్శం

వెల్దుర్తి(కృష్ణగిరి): మండలంలోని సూదేపల్లె గ్రామానికి చెందిన ప్రముఖ వ్యవసాయదారుడు, ఆధ్యాత్మికవేత్త వైద్యం గిడ్డయ్య పలువురికి ఆదర్శంగా నిలిచారని హెల్పింగ్ హ్యాండ్స్ సేవా సంస్థ అధ్యక్షుడు హరి నరసింహనాయుడు కొనియాడారు. వైద్యం గిడ్డయ్య 9వ వర్ధంతి సందర్భంగా సోమవారం ఆయన కుమారుడు వైద్యం రామానాయుడుతో కలిసి గిడ్డయ్య దంపతులు చిత్రపటాలకు నివాళులర్పించారు. అనంతరం నారాయణరెడ్డి నగర్‌లో పేదలకు దుప్పట్లు, ఆహారం అందించారు. అలాగే కామధేను గోశాలలో ఆవులకు గ్రాసం అందించడంతోపాటు పలువురు రైతులను సన్మానించారు. వెంగల్‌రెడ్డి, బలిజ శ్రీరాములు, నరసింహరావు, గోకులపాడు మల్లయ్య పాల్గొన్నారు.

సమస్యలకు పరిష్కారమేదీ?

- తూతూమంత్రంగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహణ
- అధికారుల మధ్య లోపించిన సమన్వయం
- తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో కార్యక్రమం నిర్వహణ
- కార్యక్రమంలో పాల్గొనని అధిక శాతం అధికారులు
- నిరాశగా వెనుదిరుగుతున్న జనం



ఆలూరు తహసీల్దార్ కార్యాలయంలో 12 గంటలైనా అధికారులు రాకపోవడంతో తహసీల్దార్ ఒక్కరే ఉన్న దృశ్యం



ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓతో పాటు ఇద్దరు అధికారులు మాత్రమే హాజరైన దృశ్యం

ఆలూరు రూరల్: ప్రజలు ఎదుర్కొనే సమస్యలకు పరిష్కారం చూపాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం అభాసుపాలవుతోంది. అధికారులు సక్రమంగా హాజరు కాకపోతుండటంతో ప్రజల సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. ప్రతి సోమవారం నిర్వహించే ఈ కార్యక్రమానికి అన్ని శాఖల మండల స్థాయి అధికారులు హాజరై ప్రజా ఫిర్యాదుల స్వీకరించి వాటి సమస్యకు పరిష్కారం చూపాల్సి ఉంది. ప్రజల సమస్యలపై అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తూ డుమ్మా కొడుతుండటంతో తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయానికి ఫిర్యాదులు అందించడానికి వచ్చిన ప్రజలు నిరాశగా వెనుదిరుగుతున్నారు.

కొరవడిన పర్యవేక్షణ..

ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో అధికారులు ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమానికి హాజరుకావడం లేదు. సోమవారం ఉదయం 12.15 నిమిషాలకు ఆలూరు మండల తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు లేక కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. కేవలం తహసీల్దార్ గోవింద్ సింగ్ ఒక్కరే వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అలాగే..ఎంపీడీఓ కార్యాలయంలో 11.58 నిమిషాలైనా ఎంపీడీఓతో పాటు విద్యాశాఖ, డీఆర్‌డీఏ అధికారి మాత్రమే హాజరయ్యారు. ఆలూరు మండలంలో 28 ప్రభుత్వ శాఖలు ఉన్నాయి. వ్యవసాయ శాఖ, పంచాయతీ రాజ్, గ్రామీణ తాగునీటి సరఫరా, గ్రామీణ ఉపాధి హామీ పథకం,సాంఘిక సంక్షేమ,హౌసింగ్, వైద్య,పశుసంవర్ధక శాఖ, ఐసీడీఎస్, ఆర్‌అండ్‌బీ వంటి తదితర శాఖల అధికారులు కీలకంగా ఉండి ప్రజా వినతులు స్వీకరించాల్సి ఉంది. కానీ గత నాలుగు వారాల నుంచి అధికారులు లేక ఫిర్యాదుల వేదిక వెలవెలబోతోంది.

లోపించిన సమన్వయం..

సాధారణంగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం మండలాల్లో తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహిస్తారు. అక్కడే వీడియో కాన్ఫరెన్స్ పరికరాలు ఉన్నప్పటికీ అధికారులంతా ఒకే చోట కార్యక్రమం, వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించడం లేదు. ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల్లో కార్యక్రమం నిర్వహిస్తుండటంతో.. ఏ కార్యాలయంలో ఏ అధికారి ఉంటాడో అర్థం కాక సమస్యల పరిష్కార నిమిత్తం అర్జీలు అందజేసేందుకు కార్యాలయాల చుట్టూ తిరగలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో కేవలం ఒక్క కార్యాలయంలో మాత్రమే వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించేందుకు అవకాశముండేది. ప్రస్తుతం వీసీ లింక్‌ను అధికారులందరికీ అందుబాటులో ఉంచటంతో సొంతంగా ల్యాప్‌ట్యాప్‌లు, తమ కార్యాలయాల్లో ఏర్పాటు చేసుకుంటున్నారు. దీంతో వివిధ శాఖల అధికారులు కార్యక్రమానికి సక్రమంగా హాజరుకాకపోతున్నారు. పర్యావసానంగా ప్రజల సమస్యలు అపరిష్కృతంగా మిగిలిపోతున్నాయి.

అందరూ రావాల్సిందే



ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్దేశించిన అన్ని శాఖల అధికారులు తప్పని సరిగా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి హాజరుకావాల్సిందే. దీనికి సంబంధించి అన్ని శాఖల అధికారులకు గతంలో ఆదేశాలిచ్చాం. హాజరుకాని వారిపై ఉన్నతాధికారులకు నివేదిస్తాం.

– గోవింద్ సింగ్, తహసీల్దార్

సమస్యలపై అర్జీ ఎక్కడ ఇవ్వాలో తెలియడం లేదు



ప్రజా ఫిర్యాదు వేదిక గతంలో తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే వారు ఇప్పుడు ఎంపీడీఓ కార్యాలయంలో కూడా నిర్వహిస్తున్నారు. కొంత మంది అధికారులు అక్కడ, కొంత మంది ఇక్కడ ఉడటంతో సమస్యలపై అర్జీలు ఎవరికి ఇవ్వాలో అర్థం కావడం లేదు. అలాగే అర్జీలు సమర్పించడానికి వస్తే ఇక్కడ అధికారులు ఉండటం లేదు. జిల్లా కేంద్రానికి వెళ్లి సమస్యలపై వినతులు ఇవ్వాలంటే ఖర్చుతో కూడుకున్న పని. అధికారులు స్పందించి ఇక్కడే కార్యక్రమం సజావుగా జరిగేలా చర్యలు చేపట్టాలి.

– వరుణ్ కుమార్, ఆలూరు

అడిగిన వారందరికీ పని కల్పించండి

చిప్పగిరి: జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని ఎంపీడీఓ అల్లాబకాష్ ఉపాధి హామీ సిబ్బందిని ఆదేశించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పథకం సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జాబ్ కార్డు లేని వారు మండల ఉపాధి హామీ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు .కార్యక్రమంలో ఏపీఓ జుబేర్ అహమ్మద్, టీఏ మారుతి, పంచాయతీ కార్యదర్శులు,ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

పరామర్శ

తుగ్గలి : రాంపల్లి ఎంపీటీసీ సభ్యురాలు కామిరెడ్డి లక్ష్మీదేవి భర్త కోటేశ్వరరెడ్డి ఈనెల 3న గుండె పోటుతో మృతి చెందారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి సోమవారం గ్రామానికి చేరుకొని లక్ష్మీదేవిని పరామర్శించారు. కోటేశ్వరరెడ్డి చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం లక్ష్మీదేవిని, ఆమె కుమారులను ఓదార్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసరెడ్డి, నాగభూషణరెడ్డి, సర్పంచ్ మనీంద్ర, రాతన మోహన్‌రెడ్డి, తుగ్గలి మోహన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, చంద్రశేఖర రెడ్డి, సుధాకరరెడ్డి, రాజశేఖరరెడ్డి, కొట్టాల వెంకటరాముడు, మధు, రాజు, సుధాకరరెడ్డి, విష్ణువర్ధనరెడ్డి, చక్రవర్తి ఉన్నారు.

నేడు, రేపు శిక్షణ తరగతులు

మద్దికెర : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక కార్యక్రమంపై మంగళ, బుధవారాల్లో రెండు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వీరయ్య సోమవారం తెలిపారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండలస్థాయి అధికారులకు శిక్షణ ఇస్తామని చెప్పారు. మండలంలోని సర్పంచులు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

సత్తాచాటిన పెద్దకొట్టాల ఎద్దులు



ఎద్దుల యజమానికి నగదు బహుమతి అందజేస్తున్న బహుమతి దాతలు, నిర్వాహకులు

తుగ్గలి : మునిరంగస్వామి తిరునాల ఉత్సవాల సందర్భంగా లింగనేనిదొడ్డి కొండపై ఉన్న క్షేత్రంలో నిర్వహించిన రాతి దూలం లాగుడు పోటీలు ఉత్సాహంగా సాగాయి. రెండు రోజులుగా సాగిన పోటీలు సోమవారం ముగిశాయి. పోటీల్లో 17 జతల వృషభాలు పాల్గొనగా నంద్యాల జిల్లా పెద్ద కొట్టాలకు చెందిన బోరెడ్డి కేశవరెడ్డి వృషభాలు విజేతగా నిలిచాయి. తర్వాతి స్థానాల్లో కొత్తకోట డాక్టర్ గుర్నాథ్, రంగాపురం జూటూరు రామకృష్ణారెడ్డి, సింగనగట్టుపల్లి వీరయ్య యాదవ్ వృషభాలు సంయుక్తంగా, హెచ్ కైరవాడి లక్ష్మన్న, ప్యాపిలి శీను, మల్యాల షేక్ మైమున్నీ వృషభాలు సంయుక్తంగా, మంగంపేట వీరాంజనేయులు, రుద్రవరం ఎల్లాగౌడ్, అక్కంపల్లి ఇంద్రారెడ్డి, పీఆర్‌పల్లి సోమనాథ్ యాదవ్ వృషభాలు నిలిచాయని యాంకర్ వాడాల రామానాయుడు తెలిపారు. విజేతలకు మోపూరి రాము, తలారి రామాంజనేయులు, కోటకొండ నాగప్ప తలారి చిన్నకేశన్న, చాంద్‌బాషా, నక్కన్న రాముడు, సుంకన్న, ఓబులేసు, సుధాకర్, నెట్టికంటి, సూరి, నెట్టికంటయ్య, నారాయణ, ఆది, వలిబాషా, పొన్నర్సు వెంకటపతి, మచ్చు రామాంజి, నరసింహుడు, బుసప్ప గోవిందులు వరుసగా రూ.50వేలు, రూ.40వేలు, రూ.30వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10వేలు, రూ.5వేలు అందజేశారు. కార్యక్రమంలో తెలుగు రాష్ట్రాల ఎద్దుల బండలాగుడు పోటీల కన్వీనర్ రేమట గిడ్డయ్యనాయుడు, నిర్వాహకులు వెంకటరాముడు, దేవేంద్ర, రాముడు, మాబు ,రామారావు పాల్గొన్నారు.

టీడీపీలో భగ్గుమన్న వర్గ విభేదాలు

- ఓ వర్గం వేసిన సీసీ రహదారి ధ్వంసం చేసిన మరో వర్గం
- తమకు సంబంధం లేదని పచ్చరబండపై ప్రమాణం చేసిన మరో వర్గం నేత



రోడ్డు ధ్వంసం, దాడి చేయించలేదని పచ్చర బండపై ప్రమాణం చేస్తున్న రామకృష్ణ ఆచారి

వెల్దుర్తి(కృష్ణగిరి): మండలంలోని రామళ్లకోట గ్రామంలో టీడీపీ నాయకులు మధ్య వర్గ పోరు తారస్థాయికి చేరింది. రెండు రోజుల క్రితం ఓ వర్గానికి చెందిన శశికళాధరప్ప, ఆయన భార్యపై దాడి చేయడం, ఈయన వేసిన సీసీ రహదారిని ధ్వంసం చేయడంతో ఆదివారం గ్రామంలో ధర్నా చేపట్టి నిరసన తెలిపారు. అయితే మరో వర్గానికి చెందిన నాయకుడు రామకృష్ణ ఆచారి గ్రామంలో జరిగిన సంఘటలపై తనకు ఎలాంటి సంబంధం లేదని సోమవారం గ్రామపెద్దల సమక్షంలో గ్రామంలోని వనం లక్ష్మీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో పచ్చరబండపై ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ×ఎంతో పవిత్రమైన పచ్చరబండపై ప్రమాణం చేసి దైవసాక్షిగా చెబుతున్నా.. శశికళాధరప్ప, ఆయన కుటుంబంపై జరిగిన దాడిలో తన ప్రమేయం లేదన్నారు. తాను ఎందరికో సాయం చేశానని, దాడులు చేయించానని తనపై బురద చల్లడం మానుకోవాలన్నారు. సీసీ రహదారి వేసే సమయంలో ఎస్సీ కాలనీ వాసులకు, శశికళాధరప్ప మధ్య జరిగిన గొడవలను తనపై రుద్దడం సరికాదన్నారు. కాగా టీడీపీలోని రెండు వర్గాల మధ్య జరుగుతున్న అంతర్గపోరు చూసి గ్రామ ప్రజలు అస్యహించుకుంటున్నారు. ఒకే పార్టీలో ఉంటూ దాడులు చేసుకోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. వీరి ఆగడాలతో గ్రామంలోని ప్రజలు, మహిళలు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలోని గొడవలు జరగకుండా ముందస్తు జాగ్రత్తగా ఎస్‌ఐ అశోక్ బందోబస్తు ఏర్పాటు చేశారు.


సైబర్ నేరగాళ్లతో జాగ్రత్త



హోసూరులో గ్రామస్తులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న సీఐ జయన్న

పత్తికొండ(తుగ్గలి) : సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా జాగ్రత్తగా ఉండాలని అర్బన్ సీఐ జయన్న సూచించారు. సోమవారం రాత్రి హోసూరులో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ.. సైబర్ నేరగాళ్లు రకరకాలుగా మోసాలు చేయడానికి ప్రయత్నిస్తారని ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఓటీపీ తరహా నేరాలు, బహుళజాతి సంస్థల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామని, ఆన్‌లైన్‌లో పార్శిల్ ఆర్డర్ పెట్టారని అందులో డ్రగ్స్ ఉన్నాయని, గిఫ్ట్ లేదా కూపన్లు గెలుచుకున్నారని వాటిని క్లెయిమ్ చేసుకోవాలని, మీ పిల్లలు కేసుల్లో ఇరుక్కున్నారని ఫోన్లు చేసి డబ్బులు లాగడం వంటి మోసాలు పెరిగాయని చెప్పారు. ఇలాంటి వాటికి స్పందించవద్దని చెప్పారు. సెల్‌ఫోన్‌లో వచ్చే మెసేజ్‌లు, లింక్‌లు పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. సైబర్ నేరాలపై సరైన అవగాహన లేకపోతే బాధితులుగా మిగిలిపోతారని తెలిపారు.

రైతుల ఆందోళన



ఆందోళన చేస్తున్న రైతులు

పత్తికొండ(తుగ్గలి) : నకిలీ కంది విత్తనాలతో నష్టపోయామంటూ సోమవారం పత్తికొండలో రైతులు ఆందోళన చేపట్టారు. చక్రాళ్ల, పెండేకల్లు రైల్వే జంక్షన్‌కు చెందిన రైతులు రవి, వీరేంద్ర పట్టణంలో ఓ ప్రైవేటు ఎరువుల దుకాణంలో కంది విత్తనాలు కొనుగోలు చేసి విత్తనం వేశారు. అయితే కోతల సమయం వచ్చినా పూత రాలేదని, నకిలీ విత్తనాలు అంటగట్టడంతోనే తాము తీవ్రంగా నష్ట పోయామంటూ ఎరువుల దుకాణం ఎదుట ప్రధాన రోడ్డుపై ఆందోళన చేపట్టారు. నకిలీ విత్తనాలు అంటగట్టిన దుకాణదారుడిపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దీంతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. విషయం తెలుసుకున్న పోలీసులు వచ్చి ఆందోళన విరమింపజేశారు. ఎరువుల దుకాణదారుడితో పోలీసులు చర్చించారు.

జూట్ విత్తనాలు తిని పశువులు మృతి

ఆస్పరి: మండలంలోని చిన్నహోతూరు గ్రామంలో సోమవారం జూట్ విత్తనాలు తిని రైతు శ్రీనుకు చెందిన ఆవు, బర్రె మృతి చెందగా, రెండు దూడలు తీవ్ర అస్వస్థతకు గురయ్యాయి. గ్రామంలో కోత కోసిన కంది పంటను రైతులు యంత్రాలు ద్వారా నూర్పిడి చేయించుకుంటున్నారు. ఒక నూర్పిడి యంత్రం యజమాని రెండు రోజులు క్రితం కర్ణాటక రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో జూట్ విత్తనాలను నూర్పిడి చేసి యంత్రాన్ని శుభ్రం చేయకుండా నేరుగా చిన్నహోతూరుకు తీసుకొచ్చారు. కంది పంట నూర్పిడి అనంతరం యంత్రాన్ని శుభ్రం చేసి అందులోని చెత్తను పారవేశారు. జూట్ విత్తనాలు కలిసిన కంది పొట్టును తిని రెండు పశువులు మృతి చెందినట్లు బాధిత రైతు వాపోయాడు. జూట్ విత్తనాలు పశువులు తింటే సరిగా జీర్ణం కాక పశువులు మృతి చెందే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు తెలిపారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు

మద్దికెర : గ్రామంలో ఎవరైనా ప్రభుత్వ స్థలాలు ఆక్రమించినా, వాటిల్లో నిర్మాణాలు చేపట్టినా పంచాయతీరాజ్ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటామని ఈఓ శివకుమార్ సోమవారం హెచ్చరించారు. స్థానిక సాయినగర్‌లో ప్రభుత్వ స్థలంలో బోర్డు ఏర్పాటు చేయించారు. ప్రజలకు ఉపయోగపడే ప్రభుత్వ నిర్మాణాలు చేపట్టేందుకు అనుమతి ఇస్తామని చెప్పారు.

రేపు వీరన్న చెరువు వేలం

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి సమీపంలో అటవీశాఖ పరిధిలో ఉన్న వీరగన్నగట్టు చెరువులో చేపల పెంపకానికి ఈ నెల 18వ తేదీన వేలం నిర్వహిస్తున్నట్లు ఫారెస్టు రేంజ్ అధికారి జి. విజయకుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో నాలుగుసార్లు వేలం నిర్వహించగా ఎవరూ ఆసక్తి చూపకపోవడంతో మరోమారు నిర్వహిస్తున్నామన్నారు. 2025 జూన్ 30వ తేదీ వరకు హక్కుకు సంబంధించి వేలం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు కర్నూలు రేంజ్ కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటల సమయంలో జరిగే వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

అభయాంజనేయస్వామికి అభిషేకార్చన

కృష్ణగిరి: మండలంలోని చిట్యాల గ్రామంలో అభయ అంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ జరిగి సోమవారానికి 41 రోజులు కావడంతో స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకార్చనలు చేశారు. ఆలయ నిర్వాహకుడు రామాంజయనేయ స్వామి ఆధ్వర్యంలో భక్తులు ఉదయం నుంచే స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపించారు. కార్యక్రమంలో చాలప్ప, సూరి, గోరంట్ల పాల్గొన్నారు.

సహజ ఉత్పత్తులనే వాడాలి

ఆలూరు రూరల్: ప్రకృతి వ్యవసాయంతో పండించిన ఉత్పత్తులనే ఆహారంగా తీసుకోవాలని తహసీల్దార్ గోవింద్ సింగ్ అన్నారు. ప్రజా ఫిర్యాదుల వేదిక కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించేందుకు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రకృతి ఉత్పత్తుల స్టాల్‌ను తహసీల్దార్ ప్రారంభించారు. రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి ఉత్పత్తుల స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ.. రసాయనిక ఎరువులతో పండించిన కూరగాయలు, ఆకుకూరలు, ఇతర ధాన్యాలు తినడం వల్ల అనారోగ్యాల బారిన పడతారన్నారు. సేంద్రియ ఎరువులతో సాగు చేసిన ఉత్పత్తులపై ప్రజలు అవగాహన పెంచుకోవాలన్నారు.

భక్తి శ్రద్ధలతో దేవర

కృష్ణగిరి: మండలంలోని చిట్యాల గ్రామంలో సుంకులమ్మ దేవర సోమవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆలయాన్ని మామిడి తోరణాలు, పూలతో అలంకరించారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ప్రతి ఇంటి నుంచి తెచ్చిన నైవేద్యంతో పూజించారు. మంగళవారం తెల్లవారుజామున అమ్మవారికి బలిహారం కార్యక్రమం నిర్వహించి అనంతరం ప్రతి ఇంటి నుంచి బోణాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటున్నారని గ్రామ పెద్దలు తెలిపారు.

ధనుర్మాస పూజలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో శ్రీదేవి అమ్మవారు

హొళగుంద: స్థానిక సిద్ధేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ధనుర్మాస పూజలు ప్రారంభమయ్యాయి. మొదటి రోజు వేదపండితుల ఆధ్వర్యంలో తెల్లవారుజామున స్వామి వారికి జలాభిషేకం, మహామంగళారతి, ఆకుపూజ తదితర పూజలు చేసి రుద్రాభిషేక పూజలు జరిపించారు. ఈ పూజలు వచ్చే నెల15న ముగుస్తాయని ఆలయ వంశ పారంపర్య ధర్మకర్తలు రాజ పంపన్నగౌడ్, శివశంకర్‌గౌడ్, సిద్ధార్థగౌడ్ తెలిపారు.

మద్దికెర : మండలంలోని పెరవలి గ్రామంలో వెలసిన శ్రీరంగనాథస్వామి దేవాలయంలో సోమవారం ధనుర్మాస పూజలు వైభవంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీరంగనాథుడు, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలవిరాట్, ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేపట్టారు. ఉదయం బిందెసేవ, కుంకుమార్చన, మహామంగళ హారతి ఇచ్చారు. అనంతరం ఉత్సవ మూర్తులను పల్లకీలో ఆశీనీలు గావించి ఆలయ ప్రదక్షిణ చేయించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ వీరయ్య, అర్చకులు రంగస్వామి భక్తులు పాల్గొన్నారు.

నీటి సరఫరాను పునరుద్ధరించండి



ఆలూరులో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈకి వినతి పత్రం ఇస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

హొళగుంద: సమ్మతగేరి గ్రామం వద్ద ఉన్న ఎల్లార్తి మంచినీటి పథకంలో పని చేస్తున్న కార్మికులకు జీతాలిచ్చి వారు విధులో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకులు ఎస్కే గిరి డిమాండ్ చేశారు. సోమవారం పార్టీ నాయకులు సిద్ధలింగ, అంజినప్ప, శీను తదితరులతో కలిసి ఆలూరులోని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ మల్లికార్జునను కలిసి వినతి పత్రం అందజేశారు. గిరి మాట్లాడుతూ ఎల్లార్తి మంచినీటి పథకం కింద విధులు నిర్వహిస్తున్న 8 మంది వర్కర్లకు 12 నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో వారు విధులను బహిష్కరించారని, ఫలితంగా ఈ పథకం కింద నున్న సమ్మతగేరి, కోగిలతోట, ముగుమానుగుంది, ఎల్లార్తి, చిన్నహ్యాట, బీజీ హళ్లీ, పెద్దహ్యాట గ్రామాలకు వారం రోజులుగా నీటి సరఫరా నిలిచి పోయిందన్నారు. దీంతో రంగుమారిన నీరు, కలుషిత నీటిని వదులుతున్నారని దీనివల్ల ప్రజలు అనారోగ్యం పాలువుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే.. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడం లేదని బీజేపీ మండల అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్, ఉపాధ్యక్షుడు జాంటీ వీరేష్, సెక్రటరీ మహేష్, ఉలిగేష్ తదితరులు అన్నారు. సోమవారం వారు హొళగుందలో విలేకరుతో మాట్లాడుతూ పక్కనే చెరువు ఉన్నా పలు గ్రామాలకు తాగునీరును ఇవ్వడంలో అధికారులు విఫలమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

విద్యుత్ చార్జీల పెంపు దుర్మార్గం

పత్తికొండ(తుగ్గలి) : కూటమి ప్రభుత్వం తన ఎన్నికల వాగ్దానానికి భిన్నంగా విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలపై పెనుభారం మోపడం దుర్మార్గమని సీపీఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్, మండల కార్యదర్శి రంగారెడ్డి మండిపడ్డారు. సోమవారం పట్టణంలోని ఈశ్వరరెడ్డి భవన్‌లో పార్టీ మండల మూడవ మహాసభలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. సాగునీరు లేక రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతోందని, పండిన పంటలకు గిట్టుబాటు ధరల్లేక అప్పులపాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హంద్రీనీవా పంటల కాలవల నిర్మాణాలు పూర్తిచేసి ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటం చేస్తూనే, రైతు, ప్రజా సమస్యలపై నిరంతర పోరాటాలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. పార్టీ మండల కార్యదర్శి చక్రాల్ల వెంకటేశ్వరరెడ్డి, సభ్యులు దస్తగిరి, గోపాల్, సురేంద్ర, గంగన్న, రామాంజనేయులును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

దుకాణాల వేలాల్లో ఈడబ్ల్యూసీ కోటా వర్తింపజేయాలి

ఆలూరు రూరల్: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ షాపింగ్ కాంప్లెక్స్ బహిరంగ వేలాల్లో కులాల వారీగా దుకాణాలు కేటాయించినట్లే.. ఈడబ్ల్యూసీలకు కూడా 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఆశావహులు కోరారు. సోమవారం ఈబీసీ పరిధిలోకి వచ్చే వివిధ కులాలకు చెందిన వారితో పాటు సామాజిక కార్యకర్త కమలాకర్ నాయుడు ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీఓ సూర్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. లాటరీ పద్ధతిన కులాల వారీగా రిజర్వేషన్ల ప్రకారం షాపులు కేటాచించి ఈడబ్ల్యూసీ కేటగిరికి కేటాయిచపోవడం సమంజసం కాదన్నారు. 18 షాపుల్లో 10 శాతం ప్రాతిపదికన 2 షాపులు కేటాయించి వేలాలు నిర్వహించాలని కోరారు. విరుపాక్షి, రవీంద్రనాథ్ స్వామి, శేఖర్,రవి, సర్మస్, నిరంజన్, సుమంత్ ఉన్నారు.

సీజనల్ హాస్టళ్ల ఏర్పాటు



పందికోనలో సీజనల్ హాస్టల్‌ను ప్రారంభిస్తున్న ఎంఈవో తిమ్మారెడ్డి

పత్తికొండ(తుగ్గలి) : తల్లిదండ్రులు వలస వెళ్లగా ఇంటి వద్ద ఉన్న పిల్లల కోసం ప్రభుత్వ సీజనల్ హాస్టళ్లను ఏర్పాటు చేసిందని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు సాంబశిబారెడ్డి, ఎంఈవోలు తిమ్మారెడ్డి, రమేష్ తెలిపారు. సోమవారం పుచ్చకాయలమాడలో ఏర్పాటు చేసిన సీజనల్ హాస్టల్‌ను ప్రారంభించారు. వలస కూలీల పిల్లల విద్యాభ్యాసం తెబ్బతినకుండా ఉండేందుకు సీజనల్ హాస్టళ్లను ఏర్పాటు చేసిందని వాటిని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. అలాగే పందికోన, దూదేకొండలో సీజనల్ హాస్టళ్లను ఎంఈవోలు ప్రారంభించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, హెచ్‌ఎంలు, నిర్వాహకులు పాల్గొన్నారు.

తుగ్గలి : మండలంలోని కోతికొండ గ్రామంలో సీజన్ హాస్టల్‌ను ఎంఈవో–2 రమావెంకటేశ్వర్లు సోమవారం ప్రారంభించారు. మండలంలోని జొన్నగిరిలో 2, జీ.ఎర్రగుడిలో 2, పగిడిరాయి, చెన్నంపల్లి, కోతికొండలో ఒక్కొక్కటి చొప్పున సీజనల్ హాస్టళ్లను ఏర్పాటు చేసిన ఎంఈవో తెలిపారు. ఈ కేంద్రాల్లో వలస కూలీల పిల్లలకు ఉదయం టిఫిన్, రాత్రి భోజనం, సెలవు రోజుల్లో మూడు పూటల భోజనం అందిస్తామని చెప్పారు. వలస కూలీల పిల్లల విద్యాభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన ఈ కేంద్రాలను సద్వినియోగం చేసు కోవాలని కోరారు.